
# స్థానిక ఎన్నికల్లో కుటుంబ పరిమితి నిబంధన సబబేనా?

**జనాభాలో రెండో పెద్ద దేశమైన భారతదేశం, ప్రభుత్వ పరంగా, సామాజిక పరంగా జనాభాను నియంత్రించడానికి చొరవ తీసుకుంటుంది. అందులో భాగంగా ఇటీవలి కాలంలో హర్యానా, హిమాచల్ ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒరిస్సా మొదలైన రాష్ట్రాల్లో స్థానిక సంస్థలకు (పంచాయతీరాజ్) పోటీ చేసేవారికి ఇద్దరు బిడ్డలే ఉండాలన్న నిబంధనను రాష్ట్ర పంచాయతీ రాజ్ చట్టంలో పొందుపరిచారు. విధానపరమైన ఈ నిర్ణయం పట్ల కొందరు హర్షాతిరేకాన్ని వ్యక్తం చేయగా, మరికొందరు ఇది ప్రాథమిక హక్కుల ఉల్లంఘన, మహిళా, అణగారిన వర్గాల వ్యతిరేక విధానమని ఆందోళన వ్యక్తం చేశారు.**

**ఇద్దరు బిడ్డల నిబంధన పూర్వాపరాలు...**

గత రెండు (1971-1981, 1981-1991) దశాబ్దాల్లో భారతదేశ జనాభా పెరుగుదలలో ఎలాంటి క్షీణత కనిపించలేదు. వార్షిక జనాభా పెరుగుదల 2.2 శాతంగా నమోదైంది. దీంతో ఆందోళనకు గురైన ప్రభుత్వం, కుటుంబ నియంత్రణ కార్యక్రమాన్ని పటిష్టవంతంగా అమలు చేయాలని అభిప్రాయపడింది. వాస్తవానికి ఈ కార్యక్రమం విఫలమవడానికి కారణాలు.. కేంద్రీకృత మైన ప్రణాళిక, వినూత్నత, సరళత్వం లేని పద్ధతులు, సేవల్లో నాణ్యత లోపించడం, అందరికీ అందుబాటులో లేకపోవడం. ఈ నేపథ్యంలో జాతీయాభివృద్ధి మండలి 1992లో జాతీయ జనాభా విధానాన్ని రూపొందించడానికి కమిటీని ఏర్పాటు చేసింది. ఎం.ఎస్. స్వామినాథన్ అధ్యక్షతన ఏర్పాటైన ఈ నిపుణుల కమిటీ 2010 కల్లా జనాభా పెరుగుదల అరికట్టడానికి అవసరమైన వ్యూహాన్ని రూపొందించింది. రాష్ట్రప్రభుత్వాలు తమ స్థానిక పరిస్థితులకు అనుగుణంగా రాష్ట్ర జనాభా విధానాన్ని రూపొందించుకోవాలని సిఫార్సు చేసింది.

రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో1971-91 కాలంలో జనాభా వృద్ధి మిగిలిన రాష్ట్రాల కంటే ఎక్కువగా నమోదైంది. తొంభైల్లో ఈ రాష్ట్రాలు తమ జనాభా విధానాన్ని రూపొందించుకున్నాయి. 2000 సంవత్సరంలో జాతీయా భివృద్ధి మండలి జాతీయ జనాభా విధానాన్ని ఖరారు చేసింది. దీనిప్రకారం రాబోయే 10-15 సంవత్సరాల్లో ప్రస్తుత జనాభా పెరుగుదలను కనీసం సగానికైనా తగ్గించాలి. ఈ లక్ష్యాన్ని సాధించడానికి పైన పేర్కొన్న రాష్ట్రాలు పంచాయతీరాజ్ సంస్థలకు పోటీ చేసేవారికి ఇద్దరి కంటే ఎక్కువ సంతానం ఉండకూడదనే నిబంధనను రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టంలో పొందుపరిచారు.



స్థానిక సంస్థలకు పోటీ చేసే వారికి ఈ నిబంధన వర్తింపజేయడం వల్ల జనాభా పెరుగుదలలో పెద్ద మార్పేమీ ఉండదు. అయితే ఈ విధానం పరోక్షంగా.. సామాన్య ప్రజానీకం మీద పనిచేస్తుందని అభిప్రాయపడ్డారు. స్థానిక సంస్థల ప్రతినిధులు ఆదర్శవంతమవుతారని భావించారు. అంతేకా కుండా,ప్రజా ప్రతినిధులకే ముందుచూపు లేనప్పుడు, సాధారణ పౌరుడికి ఎలా కలుగుతుందనే వాదన కూడా ఈ విధానాన్ని బలపరిచింది. మేధావి వర్గంలో కొందరు దీనిని సమర్థించారు.

1994లో జరిగిన అంతర్జాతీయ జనాభా, ప్రగతి సమావేశంలో వెలిబుచ్చిన అభిప్రాయాలను దృష్టిలో పెట్టుకొని భారత ప్రభుత్వం పునరుత్పత్తి హక్కు, ఆరోగ్యం దృక్పథంతో ఒక కార్యక్రమాన్ని రూపొందించింది. రాష్ట్రాలు కూడా తమ విధాన పత్రాల్లో పరిమిత కుటుంబ భావనను ప్రజల్లో కల్పించేటప్పుడు, లింగ సమానత్వం (Gender equality), మహిళా సాధికారత,విద్య ద్వారా మహిళల సామాజిక హోదాను మెరుగుపరచడం లాంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని నిర్ణయించాయి. ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలు తమ జనాభా విధానంలో అనుకున్న లక్ష్యాన్ని సాధించడానికి ప్రోత్సాహకాలతో పాటు ఇద్దరు బిడ్డల నిబంధనను ప్రవేశపెట్టాయి. కొన్ని రాష్ట్రాలు ఎక్కువ సంతానం ఉన్న కుటుంబాలకు చౌక ధరలలో ముఖ్య వస్తువులను లభించకుండా చేయడం, మూడో బిడ్డ నుంచి ఉచిత విద్యా సౌకర్యాన్ని తొలగించడం లాంటి వాటిని పరిశీలించాయి.

అంతర్జాతీయ ఒప్పందాలకు అనుగుణంగా జాతీయ స్థాయిలో కుటుంబ నియంత్రణ విధానాన్ని బలవంతంగా అమలు చేయవద్దని, పౌరులు స్వచ్ఛందంగా ముందుకు వస్తేనే కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించాలని కేంద్రం అభిప్రాయ పడింది. కేంద్రప్రభుత్వం అనేక సందర్భాల్లో ఇద్దరు బిడ్డల నిబంధనను సమర్థించలేమని చెప్పింది. అయితే ''ఆరోగ్యం'' రాష్ట్ర జాబితాలోని అంశం కాబట్టి కేంద్రం ఈ విషయంలో నిస్సహాయతను వ్యక్తం చేసింది. కొన్ని రాష్ట్రాలు అనుసరిస్తున్న ఇద్దరు బిడ్డల నిబంధనను స్వచ్ఛంద సేవాసంస్థలు సుప్రీం కోర్టులో సవాలు చేశాయి. అయితే సుప్రీంకోర్టు 2005లో ఇచ్చిన తీర్పులో ఆ రాష్ట్రాల చర్యను సమర్థిస్తూ.. ఇద్దరి కంటే ఎక్కువ సంతానం ఉన్న వారు ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హులుగా ప్రకటించడం

SAKSHI

ప్రాథమిక హక్కు ఉల్లంఘనకు దారితీయదని, జాతీయ ప్రయోజనాల దృష్ట్యా అలాంటి విధానం సబబేనని అభిప్రాయపడింది. ఈ తీర్పు ''కైరో కార్యక్రమ చర్య''కు విరుద్ధం. కైరో ప్రకటన ప్రకారం- ''భార్యా భర్తలకు, వ్యక్తులకు స్వేచ్ఛగా తమకు ఎందరు బిడ్డలు కావాలో నిర్ణయించుకునే హక్కు ఉంది.''

ఇద్దరు బిడ్డల నిబంధనను అమలు చేస్తున్న రాష్ట్రాల్లో స్థానిక సంస్థల ఎన్నికలకు అనర్హతకు గురైనవారిలో ఎక్కువ మంది యువత, బడుగు, బలహీన వర్గాలు, నిరక్షరాస్యులు, మహిళలు. దీని ఫలితం మానవ, ప్రజాస్వామ్య హక్కుల ఉల్లంఘన, సమత, సామాజిక న్యాయ లేమి, లింగ వివక్ష. ఈ రాష్ట్రాల్లో 'ఇద్దరు బిడ్డల' నిబంధనను పాటిస్తున్నారా లేదా అనే అంశాన్ని పరిశీలించడానికి ప్రత్యేక యంత్రాంగమంటూ లేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తేనే ఉల్లంఘించిన వారిని అనర్హులుగా ప్రకటిస్తారు. ధనిక, అగ్రవర్ణాలకు చెందినవారు తమకున్న అర్థ, కండ, రాజకీయ బలాన్ని ఉపయోగించి ఫిర్యాదులు వచ్చినా, వాటిని కప్పిపుచ్చ గలరు. చాలా సందర్భాల్లో వీరిమీద ఫిర్యాదు చేయడానికి భయ పడతారు. అంతేకాకుండా ఈ నిబంధనకు సంబంధించిన చట్టంలో అనేక అస్పష్టతలున్నాయి. కవలలు, అబార్షన్, మూడో బిడ్డను దత్తత ఇవ్వడం లాంటి విషయాల్లో స్పష్టత లేదు.

## ప్రతికూల ప్రభావం

సమాజంలో అణగారిన వర్గాల మీద ఈ నిబంధన ప్రతికూల ప్రభావం ఎక్కువగా ఉంటుందని సామాజిక శాస్త్రవేత్తల అభిప్రాయం. ఇది ముఖ్యంగా షెడ్యూల్డ్ కులాలు, తెగలు, మహిళలకు ఎక్కువ నష్టం కలిగిస్తోంది. దీనిని సమర్థించేవారు చట్టం ముందు అందరూ సమానులేనని వాదించినా.. సమాజంలో అందరూ సమానంగా అభివృద్ధి చెందడం లేదనేది, ఉన్న అవకాశాలను సరిగ్గా వినియోగించుకొనే స్థితిలో చాలా మంది లేరనేది నగ్నసత్యం. మహిళలు తమకు ఎంత మంది పిల్లలు కావాలో కోరుకునే స్థితిలో లేరు. ఈ పురుషాధిక్య సమాజంలో మహిళలు ఎప్పుడూ పాలకులు కాలేరనిపిస్తోంది. హర్యానా లాంటి రాష్ట్రాల్లో మగబిడ్డ కోసం, భర్త, అత్త-మామలు, భార్య/ కోడళ్లను ఎన్ని వేధింపులకు గురి చేస్తున్నారో పత్రిక, టీవీల ద్వారా తెలుసుకుంటున్నాం. కొడుకు పుట్టేవరకు ఆ మహిళ, పిల్లలను కంటూనే ఉండాలి. దీని పర్యవసానం ఆ మహిళ స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అర్హత కోల్పోతుంది. అనేక సందర్భాల్లో తమ పదవులు కాపాడుకోవడానికి పురుషులు తమకు మూడో సంతానం కలిగినప్పుడు, ఆ బిడ్డ తనకు పుట్ట లేదని, అది వివాహేతర సంబంధ ఫలితమని లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసిన సందర్భాలు ఉన్నాయి. ఇలాంటి సంఘటనలు సభ్యసమాజం తలవంచుకునేలా చేస్తాయి. ఈ నిబంధనను ఎమ్మెల్యేలకు, ఎంపీలకు వర్తింపజేయకుండా కేవలం స్థానిక సంస్థల ప్రతినిధులకు వర్తింపచేయడం ఎంతవరకు సమంజసం? వాస్తవానికి ఎమ్మెల్యే, ఎంపీకి సమాజంలో ఎక్కువ ప్రాశస్త్యం ఉంది. వారికి వర్తించని నిబంధన స్థానిక సంస్థల ప్రతినిధులకెందుకు?

## దృష్టి సారించాల్సిన అంశాలు:

- స్థానిక సంస్థల ప్రతినిధులు సమాజంలో ఎంతమేరకు ఆదర్శవంతమైన పాత్ర నిర్వహిస్తారు? గ్రామీణ స్థాయిలో కులం, వర్గం, లింగం ప్రముఖ పాత్ర వహిస్తాయి. రాజకీయ చదరంగంలో బలహీన వర్గాలకు చెందిన ప్రతినిధులు తమ వర్గానికి చెందిన వారిని ప్రభావితం చేయడమే అంతంత మాత్రం. ఇలాంటి పరిస్థితుల్లో మిగతా సమాజాన్ని ఏ మేరకు కుటుంబ నియంత్రణ పాటించే విధంగా చేయగలరు?
- మన దేశంలో జనాభా పెరుగుదల, దానిని అదుపులో పెట్ట డానికి శాస్త్రీయ అవగాహన అవసరం. 1950, 1960 దశకాలతో పోల్చితే 1970 నుంచి మన జనాభా పెరుగుదల క్రమేణా తగ్గుతోంది. దీన్ని బట్టి ఎక్కువ ఉత్పాదక స్థితి నుంచి తక్కువ ఉత్పాదక స్థితి వైపు పయనిస్తున్నాం. కానీ దేశ జనాభాలో ఎక్కువ శాతం యువత. కాబట్టి ఇద్దరు బిడ్డల నిబంధన అమలు చేసినప్పటికీ 2050 సంవత్సరం నాటికి దేశ జనాభా 1.2 బిలియన్ల నుంచి 1.6 బిలియన్లకు చేరుకుంటుంది. దారిద్ర్య నిర్మూలన, శిశుమరణాల సంఖ్య తగ్గింపు, విద్య, ఆరోగ్య సదుపాయాల మెరుగుదల వంటి చర్యల ద్వారా ప్రజలను స్వచ్ఛందంగా పరిమిత కుటుంబం సంస్కృతికి ప్రోత్సహించవచ్చు. బయటివారి ఒత్తిడి కంటే ప్రజలే స్వచ్ఛందంగా పరిమిత కుటుంబం వైపు మొగ్గు చూపాలి.
- ఇద్దరు బిడ్డల నిబంధన బలవంతంగా వర్తింపచేయడం.. మానవ హక్కుల ఉల్లంఘనేనని జాతీయ మానవ హక్కుల సంఘం తన 2003వ సంవత్సర నివేదికలో స్పష్టం చేసింది.
- 73వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా 33 శాతం పదవులు మహిళలకు రిజర్వు చేసి, ఇద్దరు బిడ్డల నిబంధన రూపంలో దానిని నీరుగార్చడం ఎంతవరకు సబబు? మహిళలకు తమ వివాహం విషయంలో, ఎంత మంది బిడ్డలను కనాలనే విషయంలో స్వేచ్ఛ లేదు. ఎన్నికైన పురుష ప్రతినిధులు తమ స్థానాలను నిలుపుకోవడానికి, అనేక తప్పుడు పద్ధతులను అవలంబిస్తారు. భార్యను వదిలిపెట్టడం, సంతానం తన ద్వారా కలగలేదని చెప్పడం, గర్భంతో ఉన్న భార్యను గర్భ స్రావం చేయించుకోమని బలవంతం పెట్టడం జరుగుతుంది. ఎన్నికైన మహిళకు మగ సంతానం లేకపోతే.. అందుకు ఎక్కువ బిడ్డలను కనడం దానితో అనర్హతకు గురికావడం జరుగుతుంది. ఇవన్నీ మహిళా వ్యతిరేక విధానాలు. ఇంతటి ముఖ్య విషయంపై విస్తృత చర్చ జరపకుండా.. ఏకపక్షంగా రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోవడం అప్రజాస్వామికం. జనాభా, ప్రగతి మీద జరిగిన అంతర్జాతీయ సమావేశం అభిప్రాయపడినట్లు ''గత వందేళ్లుగా అనేక దేశాలు జనాభా నియంత్రణకు బలప్రయోగ, ప్రోత్సాహక విధానాలను అను సరించాయి.కానీ అవన్నీ విఫలమయ్యాయి. కుటుంబ నియంత్రణ కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రజల స్వయంప్రేరక భాగస్వామ్యం అవసరం.''

SAKSHI